మమకారం

బి. ఎస్. రాములు

ఆ పల్లె రెండు జిల్లాలను కలిపే రహదారికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో వుంది. ఆరాత్రి లారీల రాకపోకల ధ్వనులు అక్కడికి కూడా లీలగా గాలితోపాటు చేరుతున్నాయి.

వుత్తర ప్రాంతాన్నీ దక్షిణ ప్రాంతాన్నీ రెండు జిల్లాలుగా చీల్చిన గోదావరి పరవళ్ళ ధ్వనులు ఆ నిశీరాత్రిలో నిద్రపోతున్న పల్లెకు తన నిత్య చైతన్యాన్ని ఆదర్శంగా స్వీకరించుమని చెవిలో గుసగుసలు పెడుతున్నట్టుగా వున్నాయి.

జిల్లా పరిషత్‌వారు వేయించిన అప్రోచ్ రోడ్ మరమ్మతులేక పాడుబడిపోతోంది. గంతలు గతుకులు. ఎడ్లబళ్ళ చేసిన రోడ్డుకోత. పాములా ఆపక్కనే మెలితిరుగుతూ కాలిబాట.

ఒక అడుగువెనక్కునెట్టి
మళ్ళీ వెళ్ళనని సంతకం చేయించుకొన్నా
అది నిజంగా నా సంతకమవుతుందా?
అలసినా విశ్రాంతికోసం ఎన్నడూ నీడకాగని ఓనా సూర్యుడా
నువ్వెంత కాలముదయిస్తోవుంటావు?
ఎంతకాలం నిప్పులు చెరుగుతోవుంటావు
అనేకోణాలనుండి అనేక కిరణాలతో మళ్ళీ మళ్ళీ
అంతకాలమూ ఫుట్‌పాత్‌లమీద ఇళ్ళకప్పులమీద
రైలుపట్టాల మధ్య పార్లమెంటుమీద
సముద్రంమీద సగంవిరిగిన మేఘంమీద
నాగలి నడకనడుమ దాపచెద్దు నిట్టూర్పుమీద
ఖాళీకుండలోపల పగిలిన గుండెదాపుల
బుల్లెట్ లోపల నెత్తుటిపైన
కన్నీటి చుట్టూ మృత్యువు ముందూ
నేను చెప్పినదే పదేపదే చేస్తాను మళ్ళీ మళ్ళీ ఇంకా యింకా!

(కూలిపోరాటంలో అరెస్టుచేయబడి, బస్సు కాల్చివేత అనుమానంమీద నాతో పాటు నిర్బంధాన్ని ఎదుర్కొన్న సహచరుడు కా॥ ఎస్. ఆర్‌కు స్నేహంతో)

వూరికి పడమర దిక్కుగా ఆ వాడ వుంది. ఆ వాడలో చివరి గుడిసె అది. ఆ వాడకూ ఆ చివరి గుడిసెకూ నడుమ సర్పంచు పెరడుంది. అందువల్ల ఆ గుడిసె మరీ విడివడ్డట్టుగా వుంది.

చాలా ఆలస్యంగా నిద్రకుపక్రమించినా ఎందుకో తొందరగా మెలకువ వచ్చేసింది మైసమ్మకు. అసలు నిద్ర పట్టిందో లేదో కళ్లు నులుముకొని లేచికూర్చుంది.

మనుమరాలు లచ్చవ్వ గాఢనిద్రలో వున్నట్టుంది. కడుపులోకి అదుముకున్న కాళ్ళని సరిచేసి గాఢంగా నిట్టూర్చింది

మైసమ్మ కూతురు రెండో కాన్పు కష్టమై తల్లీ పిల్లా కన్నుమూసారు అల్లుడు ఆర్నెల్లు తిరక్కముందే రెండో పెళ్ళి చేసికొని మొదటి కూతుర్ని యిక్కడ వదిలిపెట్టి పోయాడు, మూడేళ్ళ వయసునించీ తనే సాదుతోంది తండ్రి వుండీ అనాథ. మేనమావ వుండీ అనాథగా బతుకీడ్వడం, దీని దురదృష్టం. మైసమ్మ దుఃఖం వచ్చినప్పుడల్లా విలపిస్తుంది. వాస్తవంగా మైసమ్మకూడా అనాథలాగే బతుకీడుస్తోంది. యిద్దరు అనాథలొకరి కొకరు తోడయ్యారు. ఆ ఒక్కతే ప్రస్తుతం మైసమ్మ చేదోడు వాదోడు.

వున్నొక్క కొడుకు సంగం అంటూ తిరుగుతుంటాడు. ఇటీవల రెండు బ్యాచీలుగా వరుసగా అరెస్టులు జరగడంతో అరెస్టయ్యాడు. రెండువారాలు లాకపు చిత్రహింసల అనంతరం అబద్దపు కేసులో యిరికించి జైలుకు పంపారు పోలీసులు జైలుకు పంపికూడా రెండు నెలలు కావస్తోంది. ఇంకెన్నడు విడుదలౌతాడో అని ఆ తల్లి శంకరయ్యని కన్పించినపుడల్లా ఆవేదనగా, కోపంగా అడుగుతుంటుంది.

శంకరయ్యఅంటే జైలుకు పోయినవాళ్ళు పోగా, పారిపోయినవాళ్ళు పారిపోగా, వూళ్ళో సంగం కుంటుపడకుండా నడుపుతున్నవాడు.

ఎన్నిసార్లు మాటుగాసినా పోలీసులకు దొరకకుండా చాకచక్యంగా తప్పించుకున్నవాడు, ఎపుడు యింటికివస్తాడో ఎపుడు ఎక్కడకువెళ్తాడో ఏపనిచేస్తాడో అంతు చిక్కనీయనివాడు.

'ఈ రాత్రి శంకరయ్య వూళ్లెనేవున్నడట' అన్నపుకారు విన్నాచాలు ఈ రోజు ఏదో జరుగుతుంది, ఎవరిదో పనిపడ్తాడు అని ఆరాత్రి నిద్రకరువు చేసికొంటారు దొరలు.

900

దొరల్ని అదే భయంలో వుంచుతున్నాడు శంకరయ్య. అతి తక్కువగా పూర్లో పడుకుంటున్నాడు. చేన్లమీద చెలకలమీదే ఎక్కువరాత్రిలు గడుపుతున్నవాడు సాయంత్రం కలిసి తనతో చెప్పిన విషయం విన్నప్పటినించీ పాతకష్టాలన్నీ మరిచి మనసు వుత్సాహంతో వురకలు వేస్తోంది. అసలు ఆ సంతోషమే నిద్రపట్టకుండా చేసినట్టుంది.

ఎప్పుడు తెల్లవారుతుందో అని ఆలస్యానికి విసుక్కుంటూ ఎదిరిచూస్తూన్నది. తన సంతోషంలో పాలు పంచుకోవడానికెవరున్నారు? వున్నొక్క కొడుకు జైల్లోనే వుంటున్నాడాయె. పాపం! తను శంకరయ్యను వాని విడుదల కోసం కోపగించి నప్పుడల్లా ఎంత బాధపడ్డాడో! కాని శంకరయ్యది ఎంత మంచిమనసు. ఈ ముసల్దాని గురించి ఎంత కష్టపడుతున్నాడు.

శంకరయ్యే కాక సంగపోల్లందరు ఈ ముసల్దాని కోసం ఎన్ని కష్టాలనుభ వించారు! ఎన్ని నష్టాలపాలైనారు!

తన భూమి తనకు యిప్పించాలని పట్టుబట్టి ప్రజా పంచాయతీ నిర్వహించి తీర్పు యిచ్చారు వూరుమీదపడ్డ పోలీసులు తన ఒక్కదానియేకాదు. సంగపోల్లందరివి, సంగపోల్లు అయినోల్లయి, కానివారివికూడా ధాన్యం బావుల్లో పారబోశారు. తలుపులు విరగ్గొట్టారు, కుండలు బోకెలు, మంచాలు అన్నీ తుక్కుతుక్కు చేశారు. తనకైతే యింట్లో తినడానికి కంచం కూడా గతిలేకుండా చేసిపెళ్ళారు. అయింటికాడ ఓ పూట ఈ యింటికాడ ఓ పూట మనుమరాల్ని వెంటేసుకుని వెళ్ళదీసింది ఎవరూ లేదనలేదు. ఎంతమంచోల్లు శంకరయ్య వాళ్ళకు చెప్పివుండాలి. ఎంత చల్లని మనసు !

ఎంతకోపానికి వచ్చినా 'మున్సిఫ్ కోర్టుల బేలు దొరకలేదు. సెషన్ కోర్టుల రెండుసార్లు పిటిషన్ పెట్టె రెండుసార్ల కొట్టేసిరి. మల్లోసారి ఏస్తనన్నడు వకీలు. మేంజేసే అన్ని ప్రియత్నాలు తప్పకజేస్తం. నువ్వేం ఫికిరుపడకు.' అని సముదాయిస్తాడు.

ఏందో తన పిచ్చి! కొడుకువిడుదలై తన యింటిపట్టునే వుంటడని, పోలీసులు వుండనిస్తరని భ్రిమ. శంకరయ్య ఏపాటి ఇంటికాడ వుంటున్నడు? అదేందోగని తల్లిపేగు గుంజుద్ది తన కొడుకు కండ్లెదుట కనపడాల్నని. విజంగ కొడుకు గూడ శంకరయ్య తీర్గ ఆప్యాయంగ ఉంటడా?

901

ఆలోచనలతో నిద్ర మబ్బు వదలినట్టుంది. గోదావరి గలగలలు, లారీల రొదలు కలగలపి చెవిని తాకుతున్నాయి.

మెల్లగా తలుపుదీసి బయటకు నడిచింది. పూరికి కొసన వుండడంతో గాలి రివ్వునవీస్తోంది. వీస్తున్న గాలితో ఎక్కడో రాళ్లు ఎత్తేస్తున్నశబ్దం చెవిలోకి చొచ్చుకు పోతోంది.

ఏమిటో! అని చెవీ, దృష్టి అటువేపే సారించింది. అల్లంత దూరాన రోడు పులుపుమీద దయ్యంలా ఎవరో నిలబడి వున్నట్టు గమనించింది.

'ఎవరా?!' కొంచెం భయపడుతూనే గట్టిగా కేకేసింది.

'నేను రంగయ్యనే' రెండడుగులు వేసి వస్తూ మెల్లిగా చెప్పాడు రంగయ్య.

నాలుగడుగులు ముందుకేసింది మైసమ్మ. పరీక్షగా చూసింది. ఆశ్చర్యంగా అడిగింది. 'ఏంజేస్తున్నవు గీరాత్రి'

'ఇంక రాత్రెక్కడున్నది! తెల్లారుతంది! అక్కడ పొలుమారుకాడ పోలీసు జీపు రాకుంట శంకరన్నవాల్లు రోడుమీద బండకుచ్చె పేరిస్తున్నరు. దొరలు ఎవలన్న ఇటువస్తె సూసుటానికి ఈడ కావలి వున్న' అన్నాడు రంగయ్య.

'రఘుపతి దొర ఎట్లత్తడు మరి!'

'రాత్రే అచ్చిండు. అచ్చి దొరలంతకూసుండి మన పంచాయతుల ఏం మాటా డాలె ఎట్ల మాట్లాడాలె అని యిసుమడిచ్చు (చర్చించు) కొన్నరు గూడ.'

'ఈతాపకు పోలీసులత్తె మనం ఏ సిచ్చంచె ఆ శిక్షకు ఆల్లు ఒట్టువెట్టుకున్న రంటిరి గద! మల్ల గిదేంది?'

'ఎందుకైనా మంచిది. మన జాగర్తల మనం వుండాలెగద'

'ఈ పంచాయతుల మా పొలం మాకు వచ్చేనంటవా? రఘుపతి దొర ఒప్పు కునేనంటవా' ఏ మూలనో అపనమ్మకం పట్టిపీడిస్తోందో లేక మరోసారి తప్పకవస్తుం దని రంగయ్య నోటినించి వినాలని వుందో అడగనైతే అడిగింది మైసమ్మ.

'ఏయవ్వ గింతజేత్తున్నదెందుకే యిగ! మీభూమి, పట్వారిగాడు పట్టాజేయించుకున్న భూమి గురించేగాదె ఇంతగత జరిగింది గంతమంది జేల్లకోయిరి. గంతసామాను

902

పోలీసులు పాడుజేసిపోయిరి. యిగ ఏం సేక్కుంటడే.... అన్నిజేసిరి అన్నిజూస్తిమి. లం....కొడుకు ఒప్పుకోకపోవటానికి అదేమున్న వాని అయ్య సొమ్మా! తాతసొమ్మా! మీ భూమి అది! మీ భూమిలనే మిమ్ముల పాలేర్లజేసి యిన్ని రోజులు మన కష్టం తిన్నది సాలదటనా! అన్నిటికీ తెగాయించి వున్నం మనం మనసు ఎంత గోస పుచ్చుకోవాన్నో అంత గోస పుచ్చుకున్నరు. ఇంకేంజేత్తరు? అదిగూడసూద్దాం.'

ఆమాటతో మైసమ్మకు ఏక్కడలేని సంతోషం కలిగింది. ఆ వుత్సాహంలో 'నేనుగుడ బండ అందిత్త' అని పోబోయింది.

'నీకేం చాతనైతదే వద్దు' అని వారించాడు రంగయ్య.

రంగయ్యతో కబుర్లకు దిగింది మైసమ్మ.

రంగయ్యవయస్సూ, మైసమ్మవయస్సూ కొంచెం అటూయిటూగా వుంటుంది.

రంగయ్యకూ తనకూ కొన్ని విషయాల్లో పోలికల్ని గ్రహించడం వల్ల కొంత స్నేహశీలంగా మాట్లాడుతుంటుంది మైసమ్మ, రంగయ్య చెయ్యెత్తు ఎగిదిన కొడుకు సంగంపనిమీద కనబడకుండా ఏదో వెళ్ళిపోయాడు. గుండెదిటవు చేసికొన్న రంగయ్య తనకే ధైర్యం చెపుతుంటాడు.

తనకొడుకూ రంగయ్య కొడుకూ ఎంతో మంచి స్నేహితులు. రంగయ్య కొడుకు ఎంత చక్కటివాడు. కాలేజీ చదువుతున్నపుడుకూడా యింటివద్ద వున్నపుడు ఎడ్లను మేపేవాడు. తనకొడుక్కు వాడంటే ఎంత అభిమానం? వొక్కనికే అని ఏమిటి! వానితోటివాళ్లల్లో వాడంటే ఎంత అభిమానం! వాళ్లందరుగల్సి వాన్ని మేప నిచ్చేవారుకాదు. వంతులవారీగా వాళ్ళేమేపేవాళ్ళు. కథలు చెప్పమని, పాటలు పాడమని, అక్కడి సినిమాలగురించి, కాలేజీ చదువులగురించి మరీమరీ అడిగి చెప్పించుకునేవారు.

ఓరోజు రంగయ్య వచ్చి తనతో ఏమనిచెప్పాడు వాడు అందరికి నేర్పుతున్న పాటలు, మాటలు విని ఆశ్చర్యపోయాడట! ఒకింత భయపడ్డాడుకూడా! ఆ మాటలు గుట్టల్ల అన్నల మాటల్లావున్నై. అదికూడారంగయ్యకు తెలీకపోయేది. ఆరోజు అవ్వ ఏదో అందని అలిగి అన్నం తినకుండానే వెళ్ళిపోయాడట! తాను సద్ది దీసుకుపోయే సరికే వాడు మిగతావాళ్ళ సద్ది తిన్నాడు. ఏదో చెప్తున్నాడు, వాళ్ళల్లో వాడు మరీ యింత అభిమానం సంపాదించాడని అపుడుగాని తెల్సిరాలేదు.

903

అయితే ఆ రోజుల్లో సంగం గురించి అంత పట్టించుకునేవాడు కాదు రంగయ్య. అప్పటికి ఆవూళ్లొ సంగం పుట్టి చాలా రోజులే అయింది. రంగయ్య భూస్వామి కాదు పాలేరూ కాదు. వున్న రెండెకరాలు తనకుతానే సాగుచేసుకొంటున్న చిన్నరైతు. సంగం గురించి తొల్తలో అంటీఅంటనట్టుండేవాడు రంగయ్య.

కాని కొడుకు కాలేజీ చదువు వదిలిపెట్టి అన్నల్లో కల్సిపోవడం, కొడుక్కోసం తనని పోలీసులు బాధించడం, ఆస్థితిలో సంగం తనగూర్చి పట్టించుకోవడం వల్ల సంగానికి చేరువైపోయాడు.

ఓసారి వరికోతల సమయంలో కొడుకును 'పట్టిచ్చేదాక నిన్ను విడువమని' పోలీసులు యిరవై రోజులు లాకపులో వుంచి 'ఆవరి ఎవరుకోయద్దు' అని బెదిరించినపుడు సంగం ఏమైనాసరే అని సకాలానికి వరికోసింది. వచ్చిన తర్వాత కూలీ యివ్వబోతే ఎవరూ తీసుకోలేదు. దాంతో రంగయ్యకు తనకొడుకుమీద వాళ్ళకున్న అభిమానం తెల్సివచ్చింది.

ఆ అభిమానం ముందు రంగయ్య వినమ్రంగా తలవంచాడు. అప్పటినుండి తానూ సంగంలో ఒకడైపోయాడు.

ఏడ్పు విన్పించడంతో గుడిసెలోకి పరుగున వెళ్ళింది మైసమ్మ. 'నన్నిడిసి పెట్టి ఎటువోయినవు' అని గారాబంగా మైసమ్మను చేతులపైకొడ్తూ ఏడుస్తూ అడుగుతోంది మనుమరాలు.

మనుమరాల్ని సముదాయిస్తూ మైమరిచిన వుత్సాహంలో 'మన పొలం మన కత్తదటనే' అని ఏదేదో చెప్పింది. వింటూ వింటూనే మళ్ళీ నిద్రలోకి జారిపోయింది మనుమరాలు.

మైసమ్మ వుత్సాహం నీరుగారిపోయింది. తన సంతోషం పంచుకోవటానికి యింకెవరున్నారు? వున్నొక్క కొడుకుజైల్లోనే వుంటున్నాడాయె! తనపెనిమిటి బతికి వుంటే ఈ విషయం విని ఎంతపొంగిపోయేవాడో! అలా గతం కళ్ళ ముందు కదలాడింది.

తనకు వయస్సు ఈడేరిన రోజులవి. తన తల్లిదండ్రులు పెనిమిటివద్దకు పంపకుండా మొరాయించారు. తనతో పని చేయించుకోనుమరిగి పోరిది ల్యాతబొక్క అని తోలించక చాలాకాలం యింట్లోనే వుంచుకున్నారు.

నిజంగా అపుడు అలాంటి పరిస్థితే అట్లావుండేది. ఏంబాకీయో కాని అయ్య దొరలబాకీ ఎంతకట్టినా తీరేదికాదు ఎంతచేసినా తీరేదికాదు. ఓసారి బాకీకట్టనందుకు దొర తన తండ్రిని కొట్టింది కళ్ళారాచూసింది. యిప్పటికీ కళ్ళల్లో మెదుల్తూ వుంటుంది ఆస్థితిలో తాను తల్లిగారింటి వద్దే వుండిపోయింది.

పెనిమిటి మంచి వయసుమీదున్నాడు. గంగిని గుంజాడు. దొర దాన్ని పెద్ద పంచాయితీగా కావాలనిపెంచాడు. అయిదు వందల దండుగేశాడు. గంగికి దూరపు సంబంధం వస్తే ఖాయం చేయించి తులం బంగారంపెట్టాడు దొర. అయిదువందలు, తులంబంగారం దండుగుకు కలసి వేసి తమ పొలం కాజేశాడు దొర.

అయ్యా అప్పా అని బతిమాలితే ఆ పొలంలో పాలేరుగా పనిచేయటానికి అంగీకరించాడు. ఆ పొలం ఏనాటికైనా తిరిగి తమకే చెందాలని యిబ్బడిముబ్బడి లాబడితెస్తే కొన్నాళ్ళకు దొర దయతలచి తమది తమకు వదిలి పెడతాడని ఓ గుడ్డి నమ్మకం పెనిమిటికి చచ్చేదాకా వుండేది. దొరకూడా చూద్దాం అని తీయగా మాట్లాడ్తే నిజంగానే వస్తుందని భ్రమకు లోనై రాత్రి పగలు నిద్రాహారాలు మాని పంటలు దీసేవారు.

కాని పొలం తమది తమకు చెందకుండానే పెనిమిటి గతించిపోయాడు. పని చేసిచేసి నెత్తురు నీరుజేసికొని పండించిన పంటంత దొరపాలైంది. నెత్తురు పచ్చిన చెత్త కాటిపాలైంది.

బతికి వుండివుంటే యిన్నేండ్ల తర్వాతయినా తమ పొలం తమకు చెందుతున్నందుకు ఎంత సంతోషించేవాడో!

పెనిమిటి చనిపోయాకనైనా దొరకు తనమీదైనా జాలి కలుగ లేదు. తన కొడుకు ముఖమైనా చూడలేదు. మీదు మిక్కిలి సంగంబుట్టాక పల్లె నుంచి పట్నానికి మకాం మార్చిన రఘుపతి దొర 'నేను పట్నంల వుంటున్న యింక పల్లెలో వ్యవసాయం చూసుకునుడు కుదిరేటట్టులేదు. అమ్ముకుంటె పట్నంల ఏదన్న దంద చేసికోవచ్చును' కొన్నాడు.

కాని సంగం అదివరకే ఓ కట్టడి చేసింది. దొరల భూముల్ని "అమ్మనీయం కొననీయం"

దొరల భూములు పూర్వం ఎవరివో ఎవరినించి లాక్కున్నారో ఆ లిటిగేషన్లను ప్రజా పంచాయతీ నిర్వహించి ఎవరికి చెందాలో సంగం తీర్పు యివ్వడం ప్రారంభమైంది.

రఘుపతి దొర మిగతా దొరల్లా కాకుండా చాలా గుంభనంగా గంభీరంగా వుంటాడు. తొందరగా బయటపడడు. మాట పోగొట్టుకోడు. అందుకే మస్కట్ పోయివచ్చి వెంకటివద్ద మైసమ్మ పొలం అమ్మకానికి అడ్వాన్సు పుచ్చుకున్నట్టు కొంత ఆలస్యంగా తెలిసింది. అపుడు సంగం పెట్టిన పంచాయతీకి దొర హాజరైవుంటే ఈ సమస్య ఆరోజే తేలిపోయేది. అందుకే దొర కావాలనే తప్పించుకున్నాడంటాడు శంకరయ్య.

జిల్లా కేంద్రంలో కో ఆపరేటువంటి పదవులుండడంతో ఎప్పుడూ పని. అందువల్ల పల్లెకు రావడం చాలతక్కువ. ఏదో మినిష్టరు ప్రోగ్రాంలో తోడు వెళ్ళడంవల్ల ఆరోజు రాలేకపోయానని చెప్పాడు దొర.

తాను రాకున్నా సంగం, మిగతా దొరలు ఎట్లా నిర్ణయిస్తే అట్లా అంగీకరిస్తానని అన్నాడు. అలా రఘుపతి దొర లేకుండా జరిగిన ప్రజా పంచాయతీలో పట్వారీ ఎనిమిదెకరాలు నష్టపరిహారం యివ్వకుండాను రఘుపతి దొరకు సంగం నిర్ణయించిన ధర చెల్లించి మైసమ్మకు పొలం తిరిగి యిచ్చేయాలని నిర్ణయమైంది.

ప్రజలు దున్నుకొంటున్న ప్రభుత్వ భూమిని ఎవరికి తెలియకుండ తన పేరిట పట్టా చేసికొన్న పట్వారి సగానికిపైగా అమ్మేశాడు. కొన్నది పేదలే కావడంతో పట్వారి బతికిపోయాడు. సంగం పుట్టేనాటికి అమ్మగా మిగిలిన ఈ ఎనమిదెకరాల్ని పూర్వంనించి దున్నుతున్న లచ్చనికీ, బైండ్లరాజనికి సాతారపు పోషయ్యకు తలా ఎకరం చెందాలని మిగతా భూమి పంపకం తర్వాత చేద్దామని సంగం నిర్ణయించింది.

సంగం అందులో నారుపోస్తే పోలీసు క్యాంపు వేయించి విచ్చలవిడిగా అరెస్టులు చేసి కేసులు పెట్టారు. రెన్నెల్ల తర్వాత కొంత అలజడి తగ్గినట్టుండడంతో పోలీసు క్యాంపు వెళ్ళిపోయింది. ముఖ్యంగా అసలు దొర ఊళ్లో లేకపోవడం, పట్వారి పినాసితనం, క్యాంపు పోలీసులకు మర్యాద చేసేవాడు లేకపోవడంవల్ల పోలీసులు ఈ క్యాంపులో సుఖం లేదనుకున్నట్టున్నారు.

సంగం నిర్ణయించిన పొలాల్లో పరికోతను సంగం చేపట్టింది. మూడువందల మంది ఎర్రజెండాల్తో వూరేగింపుగా వెళ్ళి పంటకోశారు.

906

ఆరోజు సంగం సంరంభం జరుపుకుంటుంటే పట్వారి ముఖంచూడాలి. ప్రాణం వుండగా తోలు కమిరించినట్టు బొబ్బలేస్తూ ఎగిరాడు, ఒక్కడుగా ఏమీచేయలేనని తెల్సుకుని రఘుపతి దొర వద్దకెళ్ళి మీరు వూసుకుంటే యిద్దరిభూములూ దక్కుతాయి లేకపోతే సీళ్ళారగించి దండంబెట్టాల్సిందేనని మొరపెట్టుకున్నాడు. అన్నింటిని వోపికగా విన్నాడు రఘుపతి. ఓపికపట్టాలి అన్నాడు. అంతా మీదయ అంటూ వచ్చేశాడు పట్వారి.

కొద్దిరోజుల్లోనే పోలీసులురావడం సంగపోల్లందర్నికొట్టడం, ధాన్యాన్ని బావుల్లో పారబొయ్యడం బిందెలు చెంబులు సూటుకేసులు సమస్త సామాను పగల గొట్టినాశనం చేసిపోవడం కొందరిని తీసుకుపోయి కసితీరేదాకా లాకప్పుల్లో చిత్రి హింసలుపెట్టడం కేసులుపెట్టి జైలుకుపంపడం ఒకటివెంట ఒకటి జరిగిపోయాయి.

గీముసల్దానికోసం పాపం సంగపోల్లంత తన్నులుపడ్డారు. జైల్లకుపోయారు. ఎంతో నష్టపోయారు. అయినా పట్టినపట్టు విడవడంలేదు. తమభూమి తమకు దక్కే దాక వదిలేదిలేదు అంటున్నారు. అందుకే ఎన్నికష్టాలైనా భరిస్తున్నారు.

ఈసారి తమభూమి తమకు రాబోతోంది. ఇకనుండి అందులో పండించిన పంటంతా తమదే, దొర బేసఖలౌతాడు.

ఆ భావం రావడంతో వుత్సాహంతో కాలు నిలువడంలేదు. తన సంతోషం పదుగురిలో పంచుకోవాలని మనస్సు పురకలువేస్తోంది. తలుపు దగ్గరికివేసి బయటకు నడిసింది. రంగయ్య వారిస్తున్నా వినకుండా బండరాళ్ళ చప్పుడువేపు నడిసింది.

తెలతెలవారుతోంది. తూర్పు వేపు వెలుగురేకలు విచ్చుకొంటున్నాయి. శంకరయ్య స్వయంగా మోస్తూ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాడు.

అందరూ ఎంతో వుత్సాహంగావున్నారు. పని దాదాపు పూర్తికావొచ్చింది. ఎవర్నీ మాట్లాడిచ్చేట్టులేదు. చకచకా పని చేసుకుపోతున్నారు. అందరిట్లో కలయ దిరిగింది మైసమ్మ.

తనమాట ఎవరూ పట్టించుకునేటట్టు లేరని ఒకింత బాధపడింది, శంకరయ్య ఆప్యాయంగా పలకరించాడు.

మైసమ్మకు ఎందుకో అకస్మాత్తుగ కళ్ళలో నీళ్ల తిరిగాయి. ఆప్యాయంగా చేతులు పునికింది. మాట పెగల్లేదు. కాళ్ల పట్టుకోబోతే వారించాడు శంకరయ్య.

అపుడుగానీ జనం గమనించలేదు. ఆప్పటికి పనికూడా పూర్తి కావడంతో వారిచుట్టు చేరారు. ఆలా తెల్లవారాక అందరు యిళ్ళకు చేరారు

*   *   *   *

ఎపుడు పంచాయతీకి వెళ్ళడమా అని ఆదరబాదరగా పని ముగించుకొని మనుమరాల్ని తీసుకుని బయల్దేరింది మైసమ్మ.

ఆ చెట్టుకింద అదివరకే కొంతమంది జమఅయి ముచ్చట్లాడుతున్నట్టున్నారు. అందులో ఎన్నో విషయాలు దొర్లుతున్నాయి.

ఆ వూళ్లో సంగంపుట్టి దాదాపు ఎనిమిదేళ్ళయింది. ఈ ఎనిమిదేళ్ళలో దొరల్ని యిలా ప్రజా పంచాయతీకి పిలువడం యిది పన్నెండోసారి. ఇన్ని కట్టుదిట్టాల్తో పంచాయతీ జరపడం యిది రెండోసారి.

ఆవూరు రాగలిగే మరో రెండు బాటల్ని కూడా రాలేకుండా మూసేసారు. టెలిఫోను పలక్కుండా చేశారు.

ఎవరో సైనుబనీను నెక్కరు వేసికొన్న పిల్లవాడు చేతిలో కర్రతో అటుయిటు తిరుగుతూ ఏదో తీవ్రంగా అరుస్తున్నాడు. ఆ కొద్దిసేపట్లోనే జనం గుంపులు గుంపులుగా వచ్చేసారు. తిట్లు, శాపనార్థాలు, ముచ్చట్లు ఏకకాలంలో నడుస్తున్నాయి.

'ఎహె కాళ్లేతులు యిరుగగొట్టాలె' ఎవరో గుంపులోంచి అరుస్తున్నారు,

'పసరాదువి! లొల్లిపెట్టకుని!' చంద్రయ్య కసిరాడు. ఏదో అరుస్తుంటె ఓ పిల్లవాన్ని ఒక్కటేశాడు ఆ తల్లి 'ఏం పోకటచ్చిందిరో' అని ఈసడించింది, అంతా అంగడి అంగడిగా వుంది ఆ అరుపుల్లో ఎవరు ఏంమాట్లాడుతున్నారో విని పించడం లేదు.

అక్కడకు సర్పంచు, పట్వారి, రఘుపతి మిగతాఇరువరు చిన్న భూస్వాములు చేరింది ఎవరూ గమనించినట్టులేదు. అభిమానం సగం చచ్చింది రఘుపతికి.

'ఎవరో దొరలొచ్చిన్రు' అన్నారు.

"ఎవనికిరా దొర?" ఎవరిదో మరొక కంఠం విన్పించింది. లొల్లి మగ్గింది.

దొరలు ఇంకా నిలబడేవున్నారు. పదేండ్లకింద తప్పుల పంచాయతికి ప్రజల్ని దొరలు పిలిపిస్తే ఎట్ల గజగజ వణుక్కుంటూ నిలబడేవారో రంగయ్య మనస్సులో మెదిలి పెదవులపై హాసరేఖ వెలిగి మాయమైంది.

908

శంకరయ్య చంద్రియ్యతో ఏదోచెప్పగానే చంద్రియ్య మరోయిద్దర్ని తీసుకొని బయటకు నడిచాడు. అందర్నీ కూర్చోబెడ్తున్నాడు శంకరయ్య.

'కూసో! కూసో!' రఘుపతి దొరను గుంపులోంచి ఎవరో ఏకవచనంతో అవహేళన చేశారు. దొర ముఖం వాడిపోయింది. బీరిపోయాడు.

'ఇంత తటపటాయిస్తవేంర? నీకూ ఆ బండకు రుణపాత్కం ఈనాటిదా! కూసో! చర్నాకోల కొన చటుక్కున తాకినట్టుంది. అలాగే నిలబడితే యింకా ఎన్ని వినవలసి వస్తాయోనని కూర్చున్నాడు దొర. అల్లరి కొంతమగ్గింది.

ఇదే సమయమని కోమటి గోపన్నలేచాడు. 'నేను అందరికి కావలసినమాట జెప్తున్న. బావులకు, కరెంటుమోటర్లకు, ఎరువులకు మొదటినుండీ అప్పులిప్పిచ్చి పల్లెను పచ్చగ జేసిందెవలు? అపుడు గీసంగాలేదవోయినై?'

అందులో పట్వారి ఏదో మాటకలపబోయాడు. ఎవరో తుపుక్కున వుమ్మి వేసినట్టయి అది తనముఖంమీదేపడ్డట్టు వులికిపడి తువ్వాలుతో చెమటతుడుచుకున్నాడు. నోరుమూసుక్కూర్చున్నాడు.

ఆగి గోపన్న మళ్ళీ అందుకున్నాడు. 'మనూల్లె బతుకుతున్నంత పచ్చగ ఏ వూల్లెబతుకుతున్నరో ఒక్క వూరుసూపియ్యన్రి. అదంతా ఈదొర పుణ్యంకాదా! పుణ్యాత్మునిమీద కత్తిగట్టిన్రి. అవ్వల్ల గిదేంన్యాయం?' నోరునొక్కుతున్నాడు.

'ఎంత పుణ్యాత్ముడో అందరికి ఎరికేగని చెప్పిందాన్నే రికాంలేకుంట ఎన్ని సార్లు జెపుతరు? వినెటోల్లు ఎంతకని వింటరు? కొత్తగ ఏదన్న చెప్తెచెప్పన్రి' అసహనంగా అన్నాడు రంగయ్య.

'మొన్న గంతమందిని జేలుకుపట్టిచ్చి పున్యంగట్టుకొలేదా' ఎవరో గుంపులోంచి కేకవేశారు.

'సీయవ్వ! యియ్యాల దొరనుగోసి పియ్యకూర అండుతరంటివిగదనె! యింకెప్పుడే' మైసమ్మ వుదయాన వుత్సాహంలో మనుమరాలుతో అన్నమాటని సాగదీస్తోంది.

ఆరెండుమాటలూవిన్న రఘుపతి అరికళ్ళలో వణుకుప్రారంభమైంది. జేబులోకి చేయిపోనిచ్చాడు. లైసెన్సుడు పిస్టల్ మునివేళ్ళలోనుంచి గుండెకు ధైర్యాన్ని సరఫరా చేయడం మొదలెట్టింది.

909

'బొంతచింపులు గతిలేనోనికి గంతభూమి ఏడికెల్లి అచ్చింది. దొంగలెక్కలోన్ని నిలేసి అడుగునిరి.' గొండ్ల పోచి రోషంగా అంది.

అవి పట్వారి గుండెల్లోకి సూటిగా దూసుకుపోయాయి.

'నాది! నాదే! పట్టాభూమే' అంటూ వుగ్ర నరసింహావతారం ఎత్తాడు

'ఎవలదగ్గరగొన్నవు బాంచెన్ బైండ్ల రాజడు వెక్కిరింతగా అడిగాడు.

'నేను గంగలవడి సంపాయించిన గోదాట్లవడి సంపాయించిన గదంత మీకెందుకు? అది పట్టాభూమా! కాదా! ఓసారి కాయిదాలమీద సూసుకోనిరి!' అని ఏదో కాగితాలకట్ట తీయబోయాడు.

'నీ కాగితాలకట్ట నువుపోగేసుకో మాకెందుకు' సడ్డిముక్కు మైషి అందుకొంది 'నీకు అన్నంబెట్టినచేతులకు సున్నంబెడుతావుర, నాకొడుకును పట్టిత్తావుర.'

జీపు చప్పుడు వినబడడంతోనే చంద్రియ్య ఆదరబాదరగా పరిగెత్తుకుంటూ వచ్చి అక్కడికి మెల్లగాచేరి శంకరయ్య చెవిలో 'జీపుచప్పుడైంది పోలీసులస్తున్నట్టున్నరు' అన్నాడు.

చంద్రియ్య రావడంతో రంగయ్యని బయటకు పంపాడు శంకరయ్య ఏదో తేల్చుకురమ్మని. 'పోలీసుల్నిపిలిస్తే మర్యాద దక్కదు అని దొరలకు హెచ్చరించే వుంచారు. పోలీసుల్నిపిలిచే ధైర్యం వారికి లేదులే! అయినా తొందరగా ముగిద్దా'మని వుంది శంకరయ్యకు. కాని అది బైటికి తెలీకూడదు. ఏంచేయాలో, ఎలాచేయాలో అర్థంకాక కొంతసేపు అయోమయంలో పడిపోయాడు.

పట్వారికి కోపం ఆగడంలేదు. 'మాపొలాలు కోతకచ్చినయి కోస్తరు. కల్లంల ఒక్కిత్తులేకుంట జేస్తరు. మల్ల మీరే దబాయించి అడుగుతునారి! గది చెయ్యంగ ఎరుక లేదా!' కోపం వుద్రేకంతో వణుకుతున్నాడు.

మైసమ్మ అందుకొంది. 'ముప్పయ్యేండ్లవట్టి మాత్రం ఎవలుజేత్తునురిబాంచెన్'

గుంపులోంచి ఎవరో వడిసెలరాళ్ళలామాటలు విసిరారు 'గట్లడుగునిరి లంజ కొడుకును, గుణమస్తది. ఇన్నేండ్లపట్టి దుక్కులు సాల్లు దున్నిందెవలు? గొర్రుగొట్టిందెవలు? నాట్లేసిందెవలు? కోతలు కోసిందెవలు? బంతులు గట్టిందెవలు? అడుగురని!"

910

'మీరేరా!' ఒక చిన్నదొర వెటకారంగా అన్నాడు.

'మరి యిపుడుమాత్రిం గవన్ని జేసిందెవలు' లచ్చయ్య నిలదీశాడు.

'మీరే! మీరేలా!' పండ్లు కొరికాడు పట్వారి.

'మరి ముప్పయ్యేండ్లవట్టి గిట్ల పని జేత్తనేవున్నం. ఏ లొల్లిలేదు. గిపుడెట్ల పోలీసులకు పట్టిచ్చిన్రు?' చంద్రియ్య అమాయకంగా అడిగాడు.

'అవు! పాపం! గట్ల జేసేది లేకుండె! మీగోస తగులుతది....చా....చా....' మరో దొర వెటకరించాడు.

'నాపంట! నాపొలం! నాపడ్లు!' పిచ్చిగా అరుస్తున్న పట్వారికి గుండెలో తట్టు కున్నట్టయింది. తెగ దగ్గుతూన్నాడు.

'పోలీసుల్తోటి బావులల్ల పారబోయిచింసిరి గద! మాయిగూడ మీరే ఎత్తుకచ్చు కోనిరి. తాడుదేపోరిరి. పడుంకుగట్టి బాయిలకు విడుద్దాం. నీల్లల్ల దేవుకచ్చుకుంటడు'

'మా నెత్తుర్లు పొలాలల్ల చిమ్ముతుంటె గట్టుమీద గూసుండి బొర్ర వెంచిన్రు. ఇంకసాలదా! ఆ జేబుల పిస్తోలుతోటి మా కడుపు కాల్చినట్టు మమ్ముల గాల్చునిరి! మా పేరుమాపున్రని! మీరే బతుకున్రని! దొరా మీరే బతుకునిరి! మైసమ్మ ఆవేశంగా వూగిపోతోంది.

అందరివేపు చూస్తూ అన్నాడు శంకరయ్య. 'వడువునిరి ఎహె! ఎక్కడో ల్లక్కడ పీకునిరి! యింకేమున్నదీడ! ప్రజా పంచాయతి అంటె దొరలు జెప్పినట్టు యిన్నంత యిగ! ప్రజలెందుకు పీకనా! పీకునిరి! ఎక్కడోల్లక్కడ! వూల్లె వుండా లనుకుంటె జెల్ది తప్ష జేయునిరి: వూకె వూకె అనుకునుటానికి యిదెవలకు కొత్త! ఇది రెండో మీటింగు- చెప్తె జెల్ది చెప్పున్రని! లేకపోతె లేపిపోతం' ఆవేశంలోకూడా నిబ్బరం చూపించాడు శంకరయ్య.

చంద్రయ్యరావడం గుసగుసపెట్టడం ముఖకవళికలు మారడం రఘుపతి గమనిస్తూనేవున్నాడు. బహుశ పోలీసులు వస్తూవుండియుండవచ్చు. మరో అర్గెల్లదాకా సజావుగా సాగాలంటే యిక్కడున్న ముఖ్యుల్ని కూడా అప్పగిస్తేసరి. ఆలోగా అన్నీ అమ్ముకుపోవచ్చు, అందుకోసం పోలీసులు వచ్చేదాకా సంభాషణ సాగదీయాలను కున్నాడు.

'అయితే ఆఖరుకు నాభూమికి ఏ ధర కట్టిద్దామంటున్నరు'

'ఎకరానికీ మూడువేలు'

'పదిహేనువేలకు తక్కొవుండది. మూడువేలకు ఎట్లయియ్యాలె మీరే చెప్పునిరి.'

"నేను వున్నొక్క పొలం కాల్వకిందవోయి మొత్తుకుంటె సర్కారు గంతే ధరగడ్తదిరా అన్నముచ్చట మర్చిపోయినవా కొడుకా' ఎవరో నిలవేశారు.

అలా చర్చఅనంతంగా సాగుతోంది. కాలం పరుగెడుతోంది.

'మరి పట్వారి భూమికి ఎంత ధరగడ్తరి' అడిగాడు సర్పంచు.

'బజ్జెబూరు'

ఆ జవాబిన్నాక తాను నోరు తెరవడమే తప్పనుకున్నాడు. కొరివితో తల గోక్కోవడం ఎందుకు?

ఆరెస్టయిన వారిని విడిపించే చర్చవచ్చింది· రఘుపతి ఆ అరెస్టులతో తనకు సంబంధం లేదని బుకాయించాడు. రఘుపతి దొర ఎక్కడ తనపైనెట్టుతాదో నని పట్వారి గజ గజవణికిపోయాడు.

'సరే! ఎవరుపట్టిచ్చినోరి చర్చపెట్టుకుంటె యిపుడు వచ్చేదేముంది? మొన్న పంచాదికి పిలిసినపుడే చెప్పినంగద! మమ్ముల అడువులుపట్టిత్తె మిమ్ముల గదే పనిజేత్తం! అదియాదికుంచుకోనిరి! యిపుడు వాల్లకు బేలు తియ్యాలె. జమానతులు యియ్యాలే. కోర్టుకర్సులు పైకరుసులు అన్నీ మీరే పెట్టుకోవాలె. జమానతులు మీరే యియ్యాలె. ఆయెటి (వర్షాకాలం) పూనుతున్నది. మీరీపని జేయ్యకపోతే మేం ఎంత కూలిచ్చినా పనిజెయ్యం - యింకోరినిచెయ్యనియ్యం, పట్వారి భూమి, దొర భూమి పంచాయతి తప్ప అయిపోయినట్టే మల్లదాన్ని తిరుగదోదేదిలేదు.' అందరు చెప్పిందాని సారాంశం వివరించాడు శంకరయ్య.

మళ్ళీ తర్జన భర్జనలు చెలరేగాయి.

చూసిరాను వెళ్ళిన రంగయ్య వచ్చి శంకరయ్య చెవిలో ఏదో చెప్పాడు. అది సారాజీపని, పోలీసు జీపు కాదని అది అటే వాపసు వెళ్ళిపోయినట్టు తెల్చుకొని వచ్చాడు.

దాంతో శంకరయ్య ధైర్యం పుంజుకున్నాడు. చర్చ తారస్థాయికి చేరింది. రఘుపతి దొర పిస్తోలుకోసం మరోసారి జేబుతడిమాడు.

'మర్యాదదక్కది జాగర్త! యింతమందిమి ఎగవడ్తె నువ్వూ నీపిస్తోలూ మంట్లె కలుస్తరు.' శంకరయ్య హెచ్చరించాడు.

ఎత్తురరి బరిసెలు ఈని దొంగపెండ్లాం........' లచ్చడు కంక కట్టెతో ఎగిరి ముంగటికి వచ్చాడు.

'తియ్యిర! నంచిలకెల్లి!' ఎవరో అరుస్తున్నారు.

'దున్నేవానిదే'........

'భూమీ'

'విప్లవం'....

'వర్థిల్లాలే' నినాదాలతో దిక్కులు పిక్కటిల్లాయి.

వరిగెత్తడానికి తయారవుతున్నారు కొందరు. అంతా అల్లరి గందరగోళం. కోపోద్రిక్తులైన జనం రఘుపతి దొర మీద పట్వారీమీద దాడిచేయడానికి సిద్ధపడ్డారు.

,మీ చేతులున్న భూములన్నీ మా చేతుల్లకెల్లి గుంజుకున్నయే వొనాడు. గాభూములన్నీ మాయే! గందుకవి పోయినభూములకోసం పోరాటంజేస్తున్నం! గిదన్ల మా పానాలు పోయినా సరే గీపోరాటం ఆపేదిలేదు. మిమ్ముల నిడిసేదిలేదు. ఇన్నొరేండ్లు ఏలిన అంగ్రేజోడే మంట్లె గలిసిండు మీదో లెక్కనా!' ఆవేశంగా సవాలు చేశాడు శంకరయ్య.

ఇంకా రెచ్చిపోతున్న జనాన్ని అతి పరియాసమీద నిలుపగలిగాడు శంకరయ్య. లేకపోతే పరిస్థితి మరో విధంగా వుండేది.

భూమి ఎలాగూ దక్కేట్టులేదు. శంకరయ్య మాట మీద ఒప్పుకుంటే కనీసం గౌరవమైనా దక్కుతుందేమోననుకొని చివరకు రఘుపతి విధిలేక ఒప్పుకున్నాడు. ఎక్కడో వుండే దొరనే అంగీకరించాక పట్వారి గుడ్లు తేలవేశాడు. ఆవూళ్ళో బిచాణా ఎత్తివేయాలనుకొంటేనే అంగీకరించకూడదు. బిచాణా ఎత్తేస్తే బయట చిప్పే గతి. మిగతా భూములు కూడా యీవూళ్ళోనే ఉన్నాయి. వాటిని అమ్మనీయరు కొననీయరు కాబట్టి ఒప్పుకోవడమే మార్గంగా తోచింది పట్వారికి.

మిగతా దొరలను ఏమీ అనకపోయినా బుగులు బుగులుగానే వుంది వారికి. అందుకే అట్టే పేచీలేకుండా జమానతు ఇవ్వడానికి వొప్పుకున్నారు. ఎలాగయితేనేం చివరికి పంచాయతీ ప్రశాంతంగా ముగిసింది. ఆరోజు జనం సంతోషం ఇంతాఅంతా అని చెప్ప వీలుకాదు.

* * * *

మైసమ్మ తనకొడుకు వీరయ్య వెంటనడుస్తోంది. మనుమరాలు లచ్చవ్వ వారి కన్నాముందే పరిగెత్తి కొంత దూరం పోయాక ఆగి వాళ్ళు వచ్చేదాకవుండి తిరిగి పరుగెడుతోంది.

పచ్చగా ఏపుగా పెరుగుతున్న మక్క, నువ్వు, జొన్న, కంది చేన్లుపెరండ్లు యిరువైపులా బారులుతీరి, గాలికి కదలుతూప్రసన్నంగా పలకరిస్తున్నట్టుగా వున్నాయి.

'యింకెక్కడికిరా!' తన పొలం రావడంతో ఆగిపోయింది అవ్వ.

'అగో! గాయిప్పచెట్టు కనవడ్త లేదా! గదే!' అంటూ చూపిస్తూ విప్పచెట్టు వేపు చూశాడు వీరయ్య.

అదివరకే కొందరు చేరినట్టున్నారు. మైసమ్మకూడా వారిని చూసింది. 'ఇంకె పలో వున్నరుగదర' మీరు మాట్లాడు తుంటవుండరాదుబిడ్డ. మనపొలం మంచిగా ఏసుకుందో లేదో చూసివస్త. నీ ఎనుకనేవస్త: పా! నువు ముందునడు' అని వీరయ్య జవాబు వినకుండానే తనపొలం వేపు లచ్చవ్వను తీసుకొని నడిపింది.

పొలాల ఆ చివరన పక్కనే వున్న విప్పచెట్టు చేరవచ్చి వెనక్కి చూశాడు వీరయ్య. తల్లి యింకా పొలంకాన్నుంచి బయల్దేరనే లేదు. మోకాలుమంటిబురదలో దిగబడి వంగి ఏదో పరిశీలిస్తోంది. తల్లికి పొలంమీద వున్న మమకారానికి పరవశించి పోయాడు వీరియ్య. లచ్చవ్వ బురదలోకి దిగుతానంటే పొలం పాడైతదని వారిస్తున్నట్టుంది తల్లి

ఆ పొలంకోసమే తన తండ్రి జీవితాంతం ఎలా, ఆరాటపడిపోయాడో; అది ఈనాడు వాస్తవంగా రూపుదాల్చింది. తల్లికి ఆపొలం చేతికి వచ్చినప్పుండీ మనోవ్యాధ లేకుండాపోయింది.

914

'లాల్‌సలాం కామేడ్' అన్న అన్న పలకరింపుతో తానుకూడా ఆపొలాన్నీ తల్లినీ చూస్తూ మైమరచిపోయాడన్నది గుర్తుకువచ్చింది.

పులికిపడి 'లాల్‌సలాం' అంటూ అందరినీ పలకరించాడు.

శంకరయ్య, రంగయ్య, అన్నతోపాటు కొందరు జైలునించి తనతోపాటు విడుదలైన మిత్రులు కూర్చునివున్నారు.

'కామేడ్: శతృవు మీమీద ప్రయోగించిన రాక్షస నిర్బంధకాండని చిత్రహింసల్ని తట్టుకుని, సంగాన్నీ, సంగ నిర్వహణకు సంబంధించిన రహస్య సమాచారాన్ని ఒక్కటికూడా శతృవుకు ఆచూకీ యివ్వకుండా మీ మనస్సులోనే దాచుకుని పదిలంగా కాపాడినందుకు మీ అందరకు విప్లవాభినందనలు.' అని అన్న వారిని అభినందించాడు. అందర్నీ ఆప్యాయంగా కౌగలించుకున్నాడు.

ఒక్కొక్కరు తమ జైలు అనుభవాల్ని పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. కొట్టిన దెబ్బలు, పెట్టినహింసలు యింకా చెరిగిపోని గుర్తుల్ని చూపిస్తున్నారు. ఆప్యాయంగా నిమిరాడు అన్న.

అన్న మాటలు వింటూనే రంగయ్య పొలాలమీదికి దృష్టి సారించాడు.

పొలాలు గాలికి వయ్యారంగా పూగుతూంటే పచ్చని వెన్నెల అలలు అలలుగా ప్రవహిస్తోన్నట్టుగా వుంది. కొన్ని చోట్ల నాట్లు పడలేదు. కొన్ని పొలాల్లో నాటేసిన వరి యింకా వేరూనినట్టులేదు. లేత రంగులో కన్పిస్తోంది.

జైలుకువెళ్ళి వచ్చినవారి మాటతీరు చూస్తుంటే ఏదో తేడా కొట్టవచ్చినట్టు కన్పడుతోంది. జైలుకు పోకముందటికీ యిప్పటికీ వారెంతో ఎదిగినట్టుగా స్పష్టంగా కన్పిస్తోంది జైలుకువెళ్ళిన ప్రతి ఒక్కరూ అట్లనే అవుతున్నారు. ఆకిటుకేమిటో వుండబట్టలేక అడిగారు ఎవరో:

'విప్లవకారుడు ఎక్కడా సమయం వృధాచేయడు. ఈ నిర్బంధ పరిస్థితుల్లో మనకు జైలే ఒక రాజకీయ పాఠశాల, అరెస్టయిన సీనియర్ కామ్రేడ్స్ రోజూ ఏదో ఒక అంశంమీద క్లాసు తీసికొంటుంటారు' వివరిస్తూ అన్న, రంగయ్యవేపూ, రంగయ్య చూస్తున్న పొలాలవేపూ చూశాడు.

ఆ పొలాలు, పచ్చనిపైరండ్లు, ఎక్కడా మట్టి కన్పించకుండా పచ్చగా పెరిగిన గడ్డి. ఏవేవో చిన్నచిన్న అడవిపూలచెట్లు, ఆ దృశ్యం ఎంతో ఆహ్లాదకరంగా వుంది. ప్రకృతి ఎంత సహజంగా అందంగావుందీ! తనశ్రమశక్తితో ప్రకృతి అందాల్ని మానవుడు మరింత తీర్చిదిద్దినట్టుగావుంది. అనిర్వచనీయ ఆనందంతో పొంగిపోయాడు అన్న.

రంగయ్య దృష్టి సారించి అన్నవేపు చూశాడు. కాంతులీనుతున్న ప్రకృతి దృశ్యంయింకా చెదరిపోనట్టుంది. కళ్ళుచెదరినట్టయి ఒక్కసారిగ తనకొడుకు తనకళ్ళెదుట సాక్షాత్కరించినట్టయింది. కలో! నిజమో! తెలియని ఉద్వేగానుభూతుల్తో తన కొడుకే తనకు అన్నయి పాఠం చెపుతున్న అనుభూతిలో ఒకక్షణం పుత్రోత్సాహంతో పులకరించిపోయాడు. సంతోషం దుఃఖం జమిలితో కళ్ళనీళ్ళు నిండాయి. అన్నపై చేతులువేసి చెంపలు భుజాలు నిమిరాడు.

'ఏందె' అంటూ ఆప్యాయంగా రంగయ్య కౌగిలిలో ఒదిగిపోయాడు అన్న.

'ఏంలేదు' అని కళ్ళు తుడుచుకుని తనను సంభాళించుకుని కళ్ళు తుడుచుకున్నాడు రంగయ్య. అతండ్రిప్రేమకు విచలితులయ్యారు. వాతావరణం కొద్దిక్షణాలు గంభీరంగా వుండిపోయింది.

'మనం భూస్వాముల్తోటి మిలాఖతైనమట! కొందరు నన్ను ముఖం మీదనే అన్నరు. ఏంజెప్పాల్నో తోయలేదు. జేల్లవుండి వచ్చినోల్లం. ఇవుతల ఏం జరిగిందో తెల్వదాయె' జైలునుండి విడుదలైన కామ్రేడు సంశయనివృత్తికై అడిగాడు.

'ఏమున్నది! మనం దొరలను కొందరికి జమానతు పడమన్నం గద! గంత మందికి ఒక్కొక్కల్లకు ఇద్దరేసి జమానతుదార్లు కావాలె. భూములు జాగలునోల్లు మన సంగంల గంతమంది ఎక్కడున్నరు? తాగినోడె గత్తరు తాల్లపన్ను. కోర్టు కర్సుల్లొ కూడ సగం వాల్లు ఇచ్చుటానికి ఒప్పిచ్చినంగద! ఇగ గందుకు మనలందర్ని దొరల యిండ్లల్ల తింటను్రి. దొరల ఇండ్లల్లనే వుంటను్రి- దొరలే ఈల్లకు పైసలిత్తను్రి- దొరలకు ఈల్లుఏజంట్లు, గులాంలు, గుండాలు అనిగుడ అంటరు- అంతేనా' శంకరయ్య ఆ కామ్రేడ్ వేపు చూశాడు.

'అబ్బ నిజంగనే! నాతోటి మాసిన్నాయిన యింటికి పోయినకాడ గాయినె అచ్చం గిట్లనే అన్నడే' తన బాధ పూర్తిగా ఎదుటివాడికి అర్థమైనందుకు వుల్లాసపడిపోయాడు.

'మనం చేస్తున్న పోరాటాలు, సాధిస్తున్న విజయాలు చూసి అసూయ తోటి కొందరు గట్లనే అంటరు.' అన్నాడు శంకరయ్య.

'అదిగాదే శంకరన్నా! నిజంగనే! ఎవలన్న అడుగుతె ఏంజెప్పాలె?' అని ఆ కామ్రేడ్ అన్నవేపు సాభిప్రాయంగా చూశాడు.

916

'మనను కిందికి తొక్కి పైకిపాకిన దొరలను ఆపై పెట్టుమీంచి తిరిగి కిందికి తీసుకరావాలె. మనపోరాటాలు పెరిగినాకొద్ది మనధైర్యం పెరుగుతున్నది. సంగంఆజ్ఞలను దొరలు పాటించేట్టు చేయడం మనం సాధించాల్సిన విజయాలు. అవి మనం సాధిస్తున్న విజయాలు కూడా! మనఆజ్ఞల్ని దొరలు పాటిస్తున్నరంటె అర్థమేంది? మన సంగానికి లోబడి అణగిమణగి వుండడమన్న మాట! ఏ సంగానికైనా యింతకన్న గొప్ప విజయం ఏముంది? ఇదే అసలు విజయం' అని వివరించాడు అన్న.

అలా కొంతసేపు వివిధ అంశాలపై చర్చ జరిగింది.

'అవు అన్నా! దున్నెటోనికే భూమి యింకెన్నడైతది. పాలేర్ల జీతాలు, కూలీల పెరుగుడుకోసం. బంజెర్లు, దండుగుల వసూల్లు గుంజుకున్న భూముల్ని మల్లదీసుకునుడు గిట్ల పోరాటాలు మాజేస్తున్నంగని! అసలుపోరాటం యింకెన్నడుమొదలైతదే' ఎవరో అడిగారు.

'ఎప్పట్నుంచో గలాంటి పోరాటాలు మొదలై కొనసాగుతంటె కొత్తగా గట్ల దుగపడ్తివేంది కామ్రేడ్! మీరు మొన్నజేసిన పోరాటం ఏంటిది?' అని లాలనగా అడిగాడు అన్న.

'నువ్వేమంటున్నవో నాకు సమజైతలేదే!' ఆశ్చర్యపోయి అడిగాడు.

'మీరు మొన్నసాధించిందేంటిది? పట్వారి ఆక్రమించిన ఎనిమిదెకరాలు, దొర ఆక్రమించిన పొలం మళ్ళీ తిరిగి సంగం అధ్వర్యంలో ఎవరిదివారికి పంచలేదా! ఇదేమైన తక్కువ విజయం అనుకున్నారా!' అర్థోక్తిగా ఆగాడు అన్న.

'అవునిజమే! అయితే....?' ఆ కామ్రేడ్ అడుగుతున్నది నిజమేనన్నట్టుగా ఆసక్తిగా, ఆశ్చర్యంగా, అన్నను చూసారు కొందరు.

'ఎవలభూమి వాల్లకు సంగం యిప్పించినంక యింక దొరలదగ్గర భూమెక్కడవుంటది?'

'ఎట్ల?'

'దొరల దగ్గరున్న భూమంత ఎన్నడో ఒకనాడు పరిజలదగ్గర్నుంచి గుంజుకున్నదే గదా! వాల్లకు స్వంతం భూములంట యింకెక్కడియి?' అంటూ పరాయీకరణ జరిగిన క్రమాన్ని వివరించాడు అన్న.

'వోర్నియక్కా! కండ్లుండిగుడ్డోల్లు అంటే గిదేనేమో! అన్నజెప్పేదాక మనకు తోయకనేపాయె! నిజేమే' అన్నాడు. ఆ కామేశ్రిడ్ని ఆశ్చర్యం మరియు తాము సాధించిన విజయాల పట్ల గర్వంతో తబ్బిబ్బయిపోయారు వారు.

ఒక్కొక్కరు సెలవు తీసుకొంటూ వెళ్ళిపోతున్నారు. చెట్టుకింద అన్న, శంకరయ్య, రంగయ్య, వీరయ్య మాత్రమే మిగిలారు.

*　　*　　*　　*

'అవ్వ యింక రాకపాయె!' అన్న వీరయ్య వైపు చూశాడు. వీరయ్య పొలాల వేపు చూశాడు. అన్న కూడా అటువేపు దృష్టి సారించాడు

ఇటీవలి వర్షానికి కరిగిపోయిన కొత్తవొడ్లని పునర్‌నిర్మిస్తున్నట్లుంది మైసవ్వ.

'రైతుకు భూమి అంటె, పంట అంటె ఎంత మమకారమో సూడు. మనం యిక్కడున్నమని తనకోసం ఎదిరి చూస్తున్నమని మర్చేపోయింది. తన కష్ట ఫలితం తనకే చెందుతున్నపుడు కష్టజీవి కష్టంలోనే ఆనందం పొందుతడు!' అంటూ తనకు ఆలస్యమౌతున్నదన్న విషయం మరిచి పోయి పరవశించిపోయాడు అన్న.

'అవ్వను జెల్ది రమ్మనుపో ఆలస్యమైతంది. ఆక్కడ ఎదిరిచూస్తరు. జెల్దిపో' తేరుకొని మళ్ళీ అన్నాడు అన్న.

'అబ్బో! అది నేనుపోతె వత్తదా! నాకంటె దానికి పొలమే ఎక్కువ.' అంటూ వీరయ్య రంగయ్యను చూపాడు.

'రంగన్నా నువుపోతే వస్తదే' అన్న సూచనగా అనడంతో నవ్వుతూ లేచాడు రంగయ్య. లచ్చవ్వను అక్కడేవుంచి మోకాళ్ల వరకు అంటిన బురద చేతులంతా బురదలో అలాగే వచ్చింది మైసమ్మ. ఈ లోకాన్నే జయించినంత సంతోషం, విశ్వాసం, గర్వం అవ్వలో తొణికిసలాడుతున్నాయి. పలకరింపులు పూర్తయ్యాక అసలు విషయంలోకి వచ్చాడు అన్న.

'అవ్వా మరి వీరన్న నీకేదో చెప్పిండట గదనే'

'నాకేంజెప్పిండు! అన్న ఏదో చెప్తనన్నడు రాయే అన్నడు'

'నాతీరు రైతాంగ కార్యకర్తగ పనిచేస్తనని అన్నడు- వున్నదే వొక్క కొడుకాయె ఏమంటవో విన్నగుడ విచారిస్తె మంచిదిగదనె'

'నేను అడ్డంటె ఆగుతరా!' ఇదంతా అవ్వ మెప్పుకోసం చేస్తున్న మర్యాద అని వారి ముఖం చూస్తేనే తెలుస్తుంది.

ఎప్పట్నించో అనుకొంటూనేవున్నా. గుండె రాయిచేసికోవాలని ఎప్పటినించో ప్రియత్నిస్తున్నా మైసమ్మకు దుఃఖం ఆగలేదు. తన కొడుకుని తనలాగా జీవితాల పర్యంతం దోపిడి చేయబడ్డ వాళ్ళ బతుకుల బాగుకోసం పోరుపథంలో నడపడానికి వెళ్తున్నాడన్న వూహ యింతకు క్రితందాకా ఎంతో సంతోషాన్ని గర్వాన్నీ కల్గింప జేసింది. తన జన్మ ధన్యమైందనీ అలా వెళ్ళడం తనకు గర్వకారణమనీ మురిపించి. మనుమరాలి తోడుతో శేషజీవితం గతపగలనని నిర్ణయం చేసికొనివుంది.

అందరు మెచ్చిన పిల్లవాడితో ఎంతో సంతోషంగా కూతురి పెళ్ళి నిర్వహించి అప్పగింతల కార్యక్రిమం మొదలయ్యేసరికి పెళ్ళి పందిరంతా విషాధ ఛాయలు అలుముకున్నట్టుగా వుంది అవ్వకు.

చిన్ననాటినించి కష్టాల్లోనే పుట్టి పెరిగిన కొడుకు జీవితమంతా కళ్ళముందు కద లాడింది. కొడుకు ఎన్నడు సుఖపడ్డాడని! ఈ పేదదాని కడుపులో పుట్టి ఎన్ని బాధ లనుభవించాడు. దారిద్ర్యాన్ని మించిన బాధేముంది ప్రిపంచంలో.

తన కొడుకు నేటినుండి దరిద్రుడు కాడు. వానికి కోట్లాది పేద ప్రిజల అండ వుంది. వాన్ని తమ ప్రాణాలు ఎదురొడ్డి కడుపులో దాచుకుంటారు ప్రిజలు.

కాని తన చావుకైనా అందుతాడో లేదో! సంగపన్నలంతా తన కొడుకు లైనాక తనకు యింకా యీ చింతలేమిటి!

అలా వివిధ భావ సమ్మిశ్రితమైన దుఃఖం వుద్వేగంతో అవ్వ కళ్ళలోంచి టపటప చీరకొంగుపై కన్నీటి బొట్లు రాలి యింకిపోయాయి.

రంగయ్యకు కొడుకు కళ్ళల్లో మెదలి కను కొనుకుల్లో నీళ్లు నిలిచాయి. వారిని చూసి అక్కడున్న అందరికి కనుగుడ్లల్లో నీళ్ళు నిలిచాయి. ఎవరూ ఎక్కువగా మాట్లాడలేకపోయారు. కళ్ళనీళ్ళు తుడిచాడు అన్న.

ఎంతోసేపటికి తేరుకుంది అవ్వ. కళ్ళ నీళ్లు తుడుచుకుంది. 'కన్నపేగు కొట్టుకుంటది బిడ్డా' అని అన్నని ప్రేమగ కౌగలించుకొంది.

చివరిసారిగా కొడుకును కౌగలించుకొంది.

'మీ అయ్యపేరు నిలబెట్టాలె కొడుకా!' అశ్రుపూరిత నయనాలతో వీడ్కోలు తెలిపింది అవ్వ. రంగయ్య శంకరయ్య భాషలో చెప్పలేని వేల భావాల్ని వాళ్ళ కళ్ళల్లో ప్రితిఫలించాయి.

పిడికిల్లెత్తి లాల్‌సలామ్ చెప్పి అన్న, వీరయ్య తూర్పు దిక్కు-కేసి సాగి పోయారు.

919